అభివృద్ధి చెందుతున్న నగరంలో ప్రధాన రహదారులకు ప్రత్యామ్నాయంగా లింకు రోడ్లను నిర్మించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిర్ణయించిన గమ్య స్థానం చేరుకోవాలంటే ఎత్తయిన కొండలు, బండరాళ్లు.. కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వచ్చేది. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాగైనా దారులను దగ్గర చేయాలని నిర్ణయించి.. కొండలను తొలిచి కొత్తదారులు వేసింది. ఆ కొత్త దారులు ఇప్పుడు ఐటీ కారిడార్‌లో భారీ ట్రాఫిక్ సమస్యల నుంచి ఊరటనిస్తున్నాయి.

కొండలను చీల్చి.. రోడ్లుగా మలిచి..!

- అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఐటీ కారిడార్‌లో కొత్త లింకు రోడ్లతో ట్రాఫిక్ చిక్కులకు చెక్
- నిమిషాల్లోనే గమ్యాన్ని చేరుతున్న నగర వాసులు
- ఇప్పటికే రెండు లింకురోడ్లు అందుబాటులోకి..
- పనులు పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మూడవ దశ రోడ్డు

సిటీబ్యూరో, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : నగరంలో గణనీయంగా పెరిగిన ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కొండలను తొలగించి కొత్త దారులు వేసింది. ఆ దారులే నేడు నగరానికి కొత్త నడకలను నేర్పుతున్నాయి. అలా వేసినవే జూబ్లీహిల్స్ రోడ్ నం.51 నుంచి పాత ముంబాయి హైవే మార్గం, రాయదుర్గం నాలెడ్జ్ సిటీ నుంచి పాత ముంబాయి హైవే మార్గం, బయోడైవర్సిటీ నుంచి ఇంజినీరింగ్ సాఫ్ట్ కాలేజ్ మీదుగా ఖాజాగూడ రోడ్డు, మణికొండ చిత్రపురి కాలనీ నుంచి ల్యాంకో హిల్స్, తిరిగి అక్కడి నుంచి ఖాజాగూడ హిల్స్ మీదుగా ఔటర్ రింగు రోడ్డు వరకు నిర్మించిన పలు లింకు రోడ్లన్నీ కొండలు, గుట్టలతో కూడిన ప్రాంతాల మీదుగా నిర్మించారు. ముందుగా ఈ రోడ్లను నిర్మించడం అసాధ్యమని చెప్పినా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చొరవతో కొండలను, బండరాళ్లను లెక్క చేయలేదు. విశాలమైన

లింకు రోడ్లను నిర్మించి ప్రత్యామ్నాయ రహదారులను అందుబాటులోకి తీసుకువచ్చారు.

మూడు లింకు రోడ్లతో నేరుగా ఓఆర్ఆర్‌కు అనుసంధానం

కోర్ సిటీలో అత్యంత కీలకమైన జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల నుంచి ఔటర్ రింగు రోడ్డు వరకు ట్రాఫిక్ చిక్కులు లేకుండా సాఫీగా చేరుకోవడమే లక్ష్యంగా గత ప్రభుత్వం ఒక లింకురోడ్డును ప్రతిపాదించింది. కేబీఆర్ పార్కును అనుకొని ఉన్న రోడ్డు నంబర్ 45 నుంచి నేరుగా ఓఆర్ఆర్ దాకా వెళ్లేందుకు మూడు దశల్లో లింకు రోడ్డును నిర్మించేలా ప్రతిపాదనలు రూపొందించారు. మాదాపూర్ కేబుల్ బ్రిడ్జి, మాదాపూర్ హైటెక్ సిటీ రోడ్లకు ప్రత్యామ్నాయంగా రాయదుర్గం, మణికొండ, ల్యాంకోహిల్స్, పుప్పాల్‌గూడ, ఖాజాగూడ హిల్స్ మీదుగా ఓఆర్ఆర్ వరకు మొత్తం మూడు లింకు రోడ్లను చేపట్టారు. ఈ మార్గంలో మొత్తం గుట్టలే ఉన్నాయి. అయినా వెనకడుగు వేయకుండా హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్‌డీసీఎల్) ఇంజినీర్లు దశల వారీగా ఒక్కో లింకు రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేస్తూ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ మార్గంలో ఇప్పటికే 2 లింకు రోడ్లు అందుబాటులోకి రాగా, చివరిదైన లింకు రోడ్డు ల్యాంకోహిల్స్ నుంచి ఖాజాగూడ హిల్స్, పుప్పాల్‌గూడ మీదుగా ఓఆర్ఆర్ వరకు నిర్మాణ పనులు ఇటీవలే పూర్తయి. ప్రారంభానికి సిద్ధంగా ఉన్నది.

మూడవ దశ రోడ్డు ప్రారంభమైతే..

3వ దశ లింకు రోడ్డు ప్రారంభమైతే జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 నుంచి నేరుగా ఓఆర్ఆర్ వరకు ఎలాంటి ట్రాఫిక్ రద్దీ, సిగ్నల్స్ వంటివి లేకుండా రాకపోకలు సాగించవచ్చు. దీంతో ఇప్పటి వరకు ప్రధాన రహదారులపై ఉన్న రద్దీ సైతం గణనీయంగా తగ్గనుందని ఇంజినీర్లు పేర్కొంటున్నారు. సరిపడా నిధులు, ప్రతిపాదనలు ఉన్నా రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన మార్గంలో కొండలు, పెద్ద పెద్ద బండరాళ్లతో కూడికొని ఉండడంతో తమకు సవాల్‌గా నిలిచిందని, అయినా వెనకడుగు వేయకుండా లింకు రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ల్యాంకోహిల్స్ నుంచి ఓఆర్ఆర్ వరకు నిర్మించిన లింకు రోడ్డు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నదని, త్వరలోనే వాహనదారులకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని బెంగళూరులో ప్రత్యేక పూజలు చేసిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా దంపతులు

కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని పూజలు

కవాడిగూడ, డిసెంబర్ 10 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం బెంగళూరులోని గణపతి దేవాలయం, దొడ్డ బసవన్న దేవాలయం, బిగ్‌బుల్ దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసీఆర్ సేవలు తెలంగాణకు ఎంతో అవసరమని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే తెలంగాణ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళా కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఉప్పల స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలకు బాల సాహిత్యం దోహదం

పద్మశ్రీ డాక్టర్ కె.ఐ వరప్రసాదరెడ్డి

బాల సాహిత్య గ్రంథాలు, విజ్ఞానం– వికాసం గ్రంథాలను ఆవిష్కరించిన పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాదరెడ్డి, తదితరులు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 10 : తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో శాంతా – వసంత ట్రస్టు వ్యవస్థాపకుడు పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ. వరప్రసాదరెడ్డి మాతృమూర్తి కోడూరి శాంతమ్మ స్మృత్యంకంగా ప్రచురించిన బాల సాహిత్య గ్రంథాలు పిల్లల పాటల పరిమళం విజ్ఞానం– వికాసం గ్రంథాల ఆవిష్కరణ సభ ఆదివారం సాయంత్రం జరిగింది. సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో వరప్రసాదరెడ్డి గ్రంథాలను ఆవిష్కరించారు. బాల సాహిత్యం పిల్లలు మానసికంగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుందని వక్తలు అన్నారు. వినోదంతో కూడిన విజ్ఞానాన్ని పెంపొందించే రచనలు మరింతగా సాగించాలని బాల సాహితీవేత్తలకు సూచించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య, కోశాధికారి మంత్రి రామారావు, ప్రముఖ బాల సాహితీవేత్తలు చొక్కాపు వెంకటరమణ, గరిపెట్టి అశోక్, ప్రముఖ రచయిత్రి వి.శాంతిప్రభోద పాల్గొని బాల సాహిత్యం విశిష్టతను తమ ప్రసంగంలో విశ్లేషించారు. అనంతరం ప్రముఖ సాహితీవేత్త చీకోలు సుందరయ్య రచించిన చదివి చూద్దాం.. గ్రంథాన్ని వక్తలు ఆవిష్కరించారు.

పీజీ వైద్యుల సేవలకు గుర్తింపుగా అవార్డులు

సిటీబ్యూరో, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ): ఉస్మానియా మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల దినోత్సవం ఆదివారం మెడికల్ కాలేజీలో జరిగింది. పీజీలో విశేష ప్రతిభ కనబర్చిన డాక్టర్లకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి శ్రీ వేంకటేశ్వర మెడికల్ కళాశాల ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్, ఉస్మానియా మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డాక్టర్ శశికళా రెడ్డి, ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీటీఏ సేవా డేస్

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న వంశీ రెడ్డి

ఖైరతాబాద్, డిసెంబర్ 10 : తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు సేవా డేస్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు వంశీ రెడ్డి కంచరకుంట్ల తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్లను కో ఆర్డినేటర్లు సురేశ్ రెడ్డి వెంకన్నగారి, దుర్గా ప్రసాద్ సేలోజ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన దేశం గురించి ఏదైనా సేవ చేయాలన్న తపనతో ఈ సంఘాన్ని స్థాపించామని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత విదేశాల్లో ఉంటున్న ఇక్కడి వారికి సాయం అందిస్తూ వస్తున్నామన్నారు. 11న 400 ప్రభుత్వ బాలికల పాఠశాలల్లో వైద్య శిబిరాలు, 12న టీహబ్‌లో టెక్నాలజీపై అవగాహన సదస్సు, 13న నల్గొండ జిల్లా దేవరకొండలో దేవాలయ ప్రారంభోత్సవం, 14న భువనగిరి చౌటుప్పల్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ ప్రారంభం, 15న దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ, 16న నెక్లెస్‌రోడ్‌లో ఆరోగ్యంపై అవగాహన వాక్, 17న వికారాబాద్‌లో కృత్రిమ అవయవాల పంపిణీ, 18న వరంగల్‌లో మెగా జాబ్ మేళా, 20న నల్గొండ జిల్లా వలిగొండ, సుంకిశాలలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాలు, 21న నిజామాబాద్ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభం, 22న మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేటలో నూతన దేవాలయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. 23న రవీంద్రభారతిలో సేవా డేస్ ముగింపు వేడుకలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో సంఘం అంతర్జాతీయ ఉపాధ్యక్షులు ప్రసాద్ కూనారపు, సంతోష్, నర్సింహ, జ్యోతిరెడ్డి, నవీన్ రెడ్డి, కవితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మల చరితుడు గ్రంథావిష్కరణ

ప్రముఖ సాహితీవేత్త పీవీ మనోహరరావు రచించిన నిర్మల చరితుడు గ్రంథావిష్కరణ సభలో పాల్గొన్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 10 : మూడు దశాబ్దాలుగా సనాతన ధర్మ పరిరక్షణకు సర్వార్థ సంక్షేమ సమితి చేస్తున్న కృషిని ద్విసహస్రావధాని, బ్రహ్మశ్రీ డాక్టర్ మాడ్గుల నాగఫణిశర్మ ప్రశంసించారు. పీవీ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త పీవీ మనోహరరావు రచించిన నిర్మల చరితుడు గ్రంథావిష్కరణ సభ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయ్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సభకు బ్రహ్మశ్రీ మాడ్గుల నాగఫణి శర్మ హాజరై ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పీవీ సోదరులు ధార్మిక కార్యక్రమాలు చేపట్టి సమాజాన్ని సన్మార్గంలో నడిపించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. భగవద్గీతలోని సారాంశం మానవ జీవన విధానానికి ముడిపడి ఉన్నదని భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎల్‌వీ గంగాధర శాస్త్రి పేర్కొన్నారు. గీతా శాస్త్ర మిదం స్వరం శీర్షికన గంగాధర శాస్త్రి గీతా శ్లోకాలను గానం చేసి మానవ జన్మకు సార్థకతను చేకూర్చే అంశాలను తనదైన శైలిలో ప్రవచన రూపంలో వివరించి సభికుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. తెలుగు వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, ప్రవచకులు వీఎస్ఆర్ మూర్తి, తెలుగు పండితురాలు ఎం.సరస్వతి, పీవీ మదన్‌మోహన్, రాజ్‌మోహన్, గీత, సంధ్య, భార్గవి తదితరులు పాల్గొన్నారు. పీవీ మనోహర్ రావు సారథ్యంలో కార్తీక వన భోజనాలు చేశారు.

ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం

సిటీబ్యూరో, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ) : పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఎస్.రాము, కార్యదర్శి కె.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.